సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

మరింత విస్తృతంగా ఉచిత వైద్యసేవలు



నివేదికలోని అంశాలను వెల్లడిస్తున్న డాక్టర్ జీవీఎస్ రావు

ఎంవీపీకాలనీ: శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మరింత బలోపేతంగా ఉచిత వైద్యసేవలు అందించనున్నట్లు ఆ సంస్థల జిల్లా అధ్యక్షుడు పీఆర్‌ఎస్‌ఎన్ నాయుడు వెల్లడించారు. ఇందుకు అనుగుణంగా మరో ముందడుగు పడినట్లు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎంవీపీ కాలనీలోని ప్రేమసదన్‌లో 50 మంది సీనియర్ వైద్యులతో ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ హెల్త్‌కేర్ సహకారాన్ని పెంపొందించాలని నిర్ణయించారు. సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక ఉచిత వైద్యశిబిరాలు, స్పెషలిస్ట్ డాక్టర్ల సేవలు వినియోగం, ఔషధాలు పంపిణీ, రాష్ట్ర వ్యాప్తంగా సేవలు విస్తృతం చేయాలని తీర్మానించారు. అనంతరం శ్రీ సత్యసాయి మొబైల్ వైద్య బృందం అధ్యక్షుడు డాక్టర్ జీవీఎస్ రావు ఈ అంశంపై సమగ్ర నివేదికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ డాక్టర్లు, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏయూలో విభాగాల తనిఖీ



విభాగాలను తనిఖీ చేస్తున్న రెక్టార్ కిషోర్‌బాబు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు నేతృత్వంలోని కమిటీ సభ్యులు మంగళవారం ఏయూ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, న్యూ క్లాస్ రూమ్ కాంప్లెక్స్‌లను తనిఖీ చేశారు. విభాగాల్లో అవసరమైన మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని విభాగాధిపతులకు సూచించారు. సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు.

9న జాతీయ విద్యా దినోత్సవ కార్యక్రమం

మద్దిలపాలెం: భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని, జాతీయ విద్యా దినంగా ప్రతి ఏడాది నవంబర్ 11న జరుపుకోవడంగా ఆనవాయితీగా వస్తోంది. ఈసందర్భాన్ని పురస్కరించుకుని బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9న ఉదయం 11 గంటలకు డాబాగార్డెన్స్‌లోని ఆదిత్య డిగ్రీ కాలేజీ సెమినార్ హాల్‌లో జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించనున్నామని కో ఆర్డినేటర్ డాక్టర్. జి.బాబ్జీ తెలిపారు. కాలేజీ ప్రిన్సిపాల్ కదిరి కుమార్ బాల, వికాస ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి ప్రకాశ్‌రావు, ట్రైనర్ ఎస్.వి ఆర్.నాయుడు పాల్గొని ఆజాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారన్నారు.

కుటుంబం చెంతకు బాలుడు



బాలుడితో ఎస్‌ఐ సురేష్ బృందం

బీచ్‌రోడ్డు : తప్పిపోయిన బాలుడ్ని పోలీసులు కుటుంబం చెంతకు చేర్చారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం విజయనగరానికి చెందిన టి.స్వరూప్ కుమార్ విజయనగరంలోని ఆశ్రమంలో మూడో తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఆశ్రమం నుంచి దారితప్పి విశాఖ చేరుకున్నాడు. సిరిపురం ప్రాంతంలో రోడ్డుపై అనుమానస్పదంగా తిరుగుతుండడంతో అక్కడ విధుల్లో ఉన్న ఎస్‌ఐ సురేష్ బృందం గమనించింది. బాలుడు దగ్గరకు వెళ్లి వివరాలు అడగ్గా ఆశ్రమం నుంచి వచ్చినట్లు తెలిపారు. దీంతో బాలుడు తాతయ్య, మావయ్యకు సమాచారం అందజేశారు. వారు విశాఖ రాగా..బాలుడ్ని అప్పగించారు.



జూ పార్కులో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



ముడసర్లోవ పార్కులో పుట్ట వద్ద పూజలు



వర్సిటీలో చవితి పూజలు చేస్తున్న నగరవాసులు

నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు



జోడుగుళ్లపాలెం నాగక్షేత్రంలో శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు



ముడసర్లోవలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, కుటుంబ సభ్యులు

- భక్తిశ్రద్ధలతో నాగుల చవితి
- పుట్టల వద్ద భక్తుల కోలాహలం

ఆరిలోవ: నాగుల చవితి సందర్భంగా భక్తులు నాగేంద్రుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆరిలోవ, ముడసర్లోవ, పెదగదిలి, కంబాలకొండ పార్కు, జూ పార్కు, జోడుగుళ్లపాలెం, విశాఖ వ్యాలీ స్కూల్ రోడ్డు, కైలాసగిరి ప్రాంతాల్లో సహజ సిద్ధమైన పుట్టలు ఉండటంతో, ఆయా ప్రాంతాల్లో నాగన్న పూజల కోసం వెళ్లే భక్తులతో సందడి నెలకొంది. వేల సంఖ్యలో భక్తులు ఉదయం నుంచి పుట్టల వద్దకు చేరుకుని నాగన్న పూజలు చేశారు. పుట్టల వద్ద ముగ్గులతో అలంకరించారు. పుట్టలో పాలు, కోడి గుడ్లు, నువ్వులు ఉండలు వేసి పూజించారు. వందల కొలది సహజ సిద్ధమైన పుట్టలు ఉండటంతో నగరంలో పలు ప్రాంతాల నుంచి ఆయా ప్రాంతాలకు వాహనాలలో చేరుకున్నారు. దీంతో ఈ ప్రాంతాలు సందడిగా మారాయి. వారి వాహనాలతో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆరిలోవ పోలీసులు క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి కుటుంబ సభ్యులతో కలసి ముడసర్లోవ ప్రాంతంలో నాగన్న పూజ చేశారు. జూ పార్కు, కంబాలకొండ ఎకో టూరిజం పార్కుల్లో పుట్టలు వద్ద పూజలు చేయడంతో పాటు పిక్నిక్‌లు కూడా జరుపుకొని, రోజంతా సరదాగా గడిపారు.

ఏయూలో చవితి సందడి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చవితి సందడి నెలకొంది. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల, ఆర్ట్స్, సైన్స్ కళాశాల పరిసరాలలో పుట్టల వద్ద కుటుంబాలతో సహా వచ్చి, పూజలు చేశారు. చిన్నారులు, యువత టపాసులు కాలుస్తూ సందడి చేశారు. దీంతో విశ్వవిద్యాలయంలో మంగళవారం పండగ వాతావరణం దర్శనమిచ్చింది. కొంతమంది పూజలు చేసుకుని అక్కడే కూర్చుని ప్రసాదం తిని ఇళ్లకు వెళ్లారు.

భక్తి నుంచి భుక్తి

ఒకవైపు భక్తితో ప్రజలు పూజలు చేస్తుంటే మరొకవైపు కొంతమంది పుట్ట వద్ద వేసిన గుడ్లు, కొబ్బరి చిప్పల ఏరుకునే పనిలో పడ్డారు. ఒకవైపు పూజలు జరుగుతుండగానే వీరు గుడ్లు, కొబ్బరి చిప్పలు తీసుకువెళుతూ కనిపించారు. కొందరి భక్తి మరికొందరికి భుక్తిని కలిగించింది.

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం జ్ఞానానంద ఆశ్రమంలోని శ్రీ గౌరీజ్ఞానలింగేశ్వర దేవస్థానంలో ఉన్న నాగ దేవత, శివుడు సమేతంగా ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని పంచామృతాలో అభిషేకించి, పసుపు, కుంకుమలతో అర్చన చేశారు.

హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలాం పార్కు వద్ద, స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌లోని ఖాళీ స్థలాల్లోని పుట్టల వద్ద భక్తులు పూజలు చేశారు. పుట్టలో పాలు పోసేందుకు వచ్చిన భక్తులతో మద్దిలపాలెం, ఏయూ ఇంజినీరింగ్ కళాశాలల వద్ద సందడి నెలకొంది.

ఎంవీపీకాలనీ: నాగులచవితి సందర్భంగా ఎంవీపీ కాలనీలోని పలు ఉద్యానవనాలు, ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. నాగదోషం నివారణలో భాగంగా పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఎంవీపీ కాలనీ సెక్టార్-7లోని వీఎంఆర్‌డీఏ నర్సరీకి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. 19వ వార్డులో నాగదేవత సహిత ఎల్లమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి క్షీరాభిషేకాలు నిర్వహించారు.



గౌరీ జ్ఞానలింగేశ్వర దేవస్థానంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ..



హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలాం పార్కులో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



లాసన్స్‌బే కాలనీలోని పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

జూలో సందర్శకుల సందడి





ఏనుగుల ఎన్‌క్లోజర్ వద్ద సందర్శకుల సందడి (ఇన్‌సెట్) నీటి ఏనుగును చూస్తున్న సందర్శకులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కు సందర్శకులతో సందడిగా కనిపించింది. నాగుల చవితి సందర్భంగా మంగళవారం నాగన్న పూజల కోసం వచ్చిన భక్తులు జూలో రోజంతా గడిపారు. వేల సంఖ్యలో వచ్చిన సందర్శకుల నుంచి రూ.లక్షల్లో ఆదాయం లభించింది. ప్రతీ సంవత్సరం మాదిరిగా అధిక సంఖ్యలో సందర్శకులు వస్తారనే ఆలోచనతో జూ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. పుట్టలు వద్ద నాగన్న పూజలు చేయడానికి వచ్చినవారు బాణసంచా లోపలికి తీసుకువెళ్లకుండా ద్వారాల వద్ద తనిఖీ చేశారు. పుట్టల వద్ద ఎవ్వరూ టపాసులు కాల్చకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. నాగన్నకు పూజలు చేసిన అనంతరం జూలో పిక్నిక్‌లు జరుపుకొన్నారు. జూలో చెట్ల కింద రచ్చబండలు, పగోడాల కింద కూర్చొని తమ వెంట తీసుకువెళ్లిన భోజనాలు చేశారు. అంత్యాక్షరి, హౌసీ తదితర ఆటలతో సరదాగా గడిపారు. ఏనుగులు, కోతులు, నీటి ఏనుగులు, పులులు, సింహాలు, పాములు, తాబేళ్లు, జిరాఫీలు, వివిధ పక్షులు, నెమళ్లు, జింకలను చూసి చిన్నారులు ఉత్సాహం రెట్టింపైంది.



జూలో ఏనుగుల జోన్ వద్ద చెట్ల కింద కుటుంబాలతో సందడిగా..

డీఎంహెచ్‌వోతో బేయర్ జైడస్ ఫార్మా ప్రతినిధుల భేటీ



డీఎంహెచ్‌వో జగదీశ్వరరావుతో మాట్లాడుతున్న బేయర్ జైడస్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు

మహారాణిపేట: రేసవానిపాలెంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) కార్యాలయాన్ని ఢిల్లీకి చెందిన బేయర్ జైడస్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు మనోజ్, డాక్టర్ దాలి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావుతో పలు విషయాలు చర్చించారు. ప్రిజర్వ్ ది యుటరస్ క్యాంపెయిన్‌ను డీఎంహెచ్‌వో వివరించారు. అనంతరం శిక్షణ కోసం జిల్లాకు వచ్చిన పలువురు ఆరోగ్య సిబ్బందితో కూడా డీఎంహెచ్‌వో చర్చించారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

యూపీహెచ్‌సీ సందర్శన

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆశా డే సందర్భంగా విద్యుత్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ ఆశా డే లో న్యూ బోర్న్ కేరింగ్, గ్రోత్ మానిటరింగ్ చార్ట్, న్యుమోనియా ఏ విధంగా ముందుగా తెలుసుకోవాలి, స్పేసింగ్ మెథడ్స్ ఏ విధంగా పాటించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, వివిధ విభాగాల ఇన్‌చార్జులు వి.నారాయణరావు, నాగభూషణం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

యువత బాధ్యతాయుతంగా నడుచుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

విశాఖ సిటీ: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, బాధ్యతాయుతంగా నడుచుకోవాలని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు సూచించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాలపై ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డ్రగ్స్, సైబర్ నేరాలు, ట్రాఫిక్, రహదారి భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం కారణంగా ఆరోగ్యం పాడవడంతో పాటు, చట్టపరమైన చర్యలకు బాధ్యులుగా నిలవాల్సి వస్తుందని చెప్పారు. వీటి వినియోగంతో పాటు కలిగి ఉండడం, రవాణా చేయడం కూడా చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. సైబర్ నేరాలు జరగకుండా నిరోధించడంలో యువత ముఖ్య భూమిక పోషించాలని చెప్పారు. హెల్మెట్ ధరించడం, లైసెన్స్ కలిగి ఉండడం వంటి ప్రాథమిక నియమాలను పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడం, నియంత్రించడం అందరి సమన్వయం, సహకారంతోనే సాధ్యపడుతుందన్నారు. యువత రాష్ డ్రైవింగ్ మానుకోవాలని, ఇది వారితో పాటు రహదారిలో ప్రయాణించే ఇతరులకు కూడా ప్రాణాంతకంగా మారుతుందన్నారు.

విద్యార్థి దశలో ఎన్నో సవాళ్లు

విద్యా విభాగాధిపతి ఆచార్య టి. షారోన్ రాజు మాట్లాడుతూ విద్యార్థి దశ ఎన్నో సవాళ్లతో కూడుకున్నదన్నారు. చుట్టూ సమాజంలో అనేక ఆకర్షణలు యువతను పెడదోవ పట్టించే దిశగా నడిపిస్తాయిని, వీటి నుంచి దూరంగా ఉండాలని సూచించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలు, క్రమశిక్షణతో ముందుకు సాగితే అందమైన భవిష్యత్తు సాకారం అవుతుందని వివరించారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ సాల్మన్, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ రాము, డాక్టర్ మూర్తి, డాక్టర్ హేమలత, డాక్టర్ వినీలకుమారి పాల్గొన్నారు.

భుక్తి



భక్తి కొందరికి భుక్తినిస్తోంది. చవితి వేడుకలు జరిగిన పుట్టల వద్ద కొంతమంది గుడ్లు సేకరించారు. ఏ మాత్రం భయం లేకుండా పుట్టల్లో చేతులు పెట్టి గుడ్లు తీయడం కనిపించింది. – ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్

నర్సింగ్ కోర్సు.. అవకాశాలు అనేకం



విద్యార్థులతో ఎంపీ భరత్

బీచ్‌రోడ్డు: మనదేశంలో ప్రధానంగా మన రాష్ట్రంలో నర్సింగ్ విద్య అభ్యసించిన విద్యార్థులకు అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఎంపీ శ్రీభరత్ తెలిపారు. సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో సెయింట్ లూక్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, విజయా లూక్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ సంయుక్త ఆధ్వర్యంలో బీఎస్సీ గ్రాడ్యుయేషన్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే మంచి వేతనాన్ని గౌరవప్రదమైన ఈ నర్సింగ్ వృత్తితో పొందగలుగుతున్నారని తెలిపారు.

కార్యక్రమంలో భాగంగా బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన పట్టభద్రులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.ప్రభాకర్ శర్మ, ప్రొఫెసర్ కె.సుశీల, గాయత్రి విద్యా పరిషత్ మెడికల్ కాలేజ్ సర్జరీ విభాగం హెడ్ ప్రొఫెసర్ జి.అర్జున, సెయింట్ లూక్స్ విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ప్రీతం లూక్, ప్రతినిధులు ఎం.విజయా లూక్, మమతా ప్రసాద్, షావీలా ప్రీతం, షైనీ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

● సైకిల్‌పై సవారీ..

ప్రస్తుత రోజుల్లో బిజీబిజీ లైఫ్‌స్టైల్ కారణంగా చాలా మంది వ్యాయామానికి దూరమవుతున్నారు. ఆహార అలవాట్లలో మార్పులు, శారీరక శ్రమ తక్కువ కావడం, గంటల తరబడి ఒకే దగ్గర కూర్చోవడం వంటివి అధిక బరువు, ఇతర ఆరోగ్య సమస్యలకు దారి తీస్తున్నాయి. అయితే గంటల తరబడి ఎక్సర్‌సైజ్‌లు చేయకపోయినా.. రోజులో కొద్దిసేపు సైక్లింగ్ చేయడం బెస్ట్ ఆప్షన్ అని నిపుణులు చెబుతున్నారు. రోజూ కొద్దిసేపు సైకిల్ వినియోగిస్తే.. ఫిజికల్‌గా యాక్టివ్‌గా ఉండటంతో పాటు, శరీరానికి వ్యాయామం అందుతుందని అంటున్నారు. విశాఖ సాగరతీరంలో సైకిల్ తొక్కుతూ ఫిట్‌నెస్ పెంచుకునేవారు దర్శనమిస్తున్నారు. ముఖ్యంగా ఆదివారం చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ సైకిల్ సవారీ చేస్తూ సందడి చేస్తున్నారు. - ఏయూక్యాంపస్



పెద్దటైర్లతో ఆకట్టుకుంటున్న సైకిల్‌పై బాలుడు



సైకిల్‌పై సవారీ చేస్తున్న వృద్ధుడు



సైకిల్ తొక్కుతున్న బాలుడు



సైకిల్ తొక్కుతున్న యువకుడు

ఇరుకు రహదారుల్లో భారీ వాహనాలు



భారీ వాహనం రాకతో ట్రాఫిక్ జామ్



భారీ వాహనం బరువుకు ఏర్పడిన రంధ్రం

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డులోని శివాజీపాలెంలోని సందుల్లోకి భారీ వాహనాలు తరచూ రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భారీ వాహనాలు రాకపోకలతో రహదారులు ఛిద్రమవుతున్నాయి. రాత్రి సమయంలో భారీ వాహనాలు రాకపోకలు సాగించినా స్థానికులకు, ఇతర వాహనాలకు ఎటువంటి ఇబ్బందులుండవు.

అయితే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి మరీ పగటి పూట భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ట్రాఫిక్ పోలీసులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హైందవ శంఖారావం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జీవీఎల్ తదితరులు

ఎంవీపీకాలనీ: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సంఘ్ పరివార్ జనవరిలో హైందవ శంఖారావం పేరిట బహిరంగ సభను నిర్వహించనుంది. విజయవాడ వేదికగా జనవరి 5వ తేదీన నిర్వహించనున్న ఈ సభ పోస్టర్‌ను మంగళవారం లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, ఆయా సంస్థల ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బహిరంగ సభ ఏర్పాట్లపై సమీక్షించారు. విశాఖ ప్రాంత బౌద్ధిక్ కొండపల్లి రామారావు, విశ్వహిందూ పరిషత్ నగర ఉపాధ్యక్షుడు అన్నే నారాయణరావు, విశాఖ నగర సంఘ్ చాలక్ పీవీ నారాయణరావులు ఈ సందర్భంగా సభ ఏర్పాట్లు, హాజరు కానున్న అతిథులు, నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. సనాతన హిందూ దేవాలయాల్లో జరుగుతున్న అపచారాలు, ఆస్తుల అన్యాక్రాంతం, అన్యమత ప్రచారాల నివారణ వంటి అంశాలను అరికట్టే డిమాండ్‌తో సభ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ పాల్గొన్నారు.

శాసనాల అధ్యయనంపై ప్రసంగం



విద్యార్థులకు వివరిస్తున్న ప్రొఫెసర్ సోమసుందర్ రావు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవి ద్యాలయం హిస్టరీ ఆర్కియాలజీ విభాగం ప్రొఫెసర్ సి.సోమసుందర్ రావు శాస నాల అధ్యయనం మీద వి ద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆర్కియాలజీ- చరిత్ర చదువుతున్న విద్యార్థులకు ఈ సబ్జెక్టు ప్రాముఖ్యతను, ఉపయోగాలను వివరించారు. ఇటీవల ఆయన చరిత్ర, పురాతత్వశాస్త్రంపై రచించిన పుస్తకం రివైజ్డ్ ఎడిషన్‌ను క్లుప్తంగా చర్చించారు. విభాగంపై ఉన్న మక్కువతో 2023–25 బ్యాచ్ విద్యార్థులకు ఈ రీవైజ్డ్ ఎడిషన్ పుస్తకాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. వయోభారాన్ని సైతం పక్కన పెట్టి విద్యార్థులకు జ్ఞానాన్ని అందించాలని ఆలోచనతో ఆయన స్వయంగా వారికి బోధన చేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి సి.హెచ్.మధుసూధన్ రావు, ఎం.రమేష్ బాబు, బి.ఆనంద్, బి.రాజా, సాయి ప్రసాద్ పాల్గొన్నారు.





● తల్లి ప్రేమ

ఏయూ ఇంజినీరింగ్ కాలేజీలోని మైదానంలో చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. పుట్టల వద్ద భక్తులు బాణసంచా పేల్చడంతో ఒక దూడ భయపడి తుప్పల్లో చిక్కుకుంది. దీనిని గమనించిన భక్తులు వెంటనే ఆ దూడను బయటకు తీసి తల్లి ఆవు వద్దకు చేర్చారు. దీంతో ఆవు తన దూడకు ప్రేమగా పాలిస్తూ కనిపించింది.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
✆ 7331119904, 9912440606
సాక్షి